# మాష్టారు చచ్చిపోవాలి

కె. తాయారమ్మ

ఎర్రని మారుతీకారు శివంగిపురం వైపుగా సాగిపోతోంది. జిల్లాజడ్జీ చక్రధరరావు డ్రైవింగ్ సీట్లో కూర్చుని విలాసంగా స్టీరింగ్ తిప్పుతున్నాడు.

అతనికి నలభై ఏళ్ళుంటాయి.

హుందాగా దర్పంగా వెలిగి పోతున్నాడు.

"డాడీ మనం ఎక్కడికి పోతున్నాం?" అతని పక్కనే కూచున్న ఎనిమిదేళ్ల వెంకూ ప్రశ్నించాడు.

"దేవాలయానికి బాబూ!" అన్నాడు చక్రధరరావు వెంకూ తల మీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమురుతూ.

"శివంగిపురంలో కోవెలుందా?" మళ్ళీ ధర్మ సందేహాన్ని వెలువరించాడు వెంకూ.

"వీడికి చదువు తప్పించి అన్నీ ఆసక్తే!" అనుకుంటూ, దేవుడిలాటి మనిషి వున్నాడు బాబూ అక్కడ, అన్నాడు చిన్నగా విసుక్కుంటూ.

మరేమీ ప్రశ్నించకుండా ప్రకృతి దృశ్యాలు తిలకిస్తూ కూచున్నాడు వెంకూ.

చక్రధరరావు ఆలోచనంతా ఒక్కటే. "ముందుగా మాష్టార్ని చూడాలి!" "తనెంత గొప్పవాడయ్యేడో ఆయన చూడాలి!"

"చిన్నప్పుడు తను ఆయన పట్ల ఎలా ప్రవర్తించేవాడు?" విషాదహర్ష సమ్మిళిత మైన నవ్వు వెలిగింది అతని పెదాలమీద.

"డాడీ..... ఇంకా.... ఎంతదూరం పోవాలి?" వెంకూ ప్రశ్నించాడు. వాడి ప్రశ్నలో విసుగు ధ్వనిస్తోంది.

కాలునడకని పోతున్న వాడిలా చిరాకెత్తి పోతున్న కొడుకుని చూస్తూ వుంటే కోపం పెల్లుబికింది చక్రధరరావులో.

కొడుక్కి ఏసమాధానం చెప్పకుండా మౌనం వహించాడు అతను.

దూరంగా "శివంగిపురం" అన్న బోర్డు కనుపించింది.

"వచ్చేశాం బాబూ!" అన్నాడు చక్రధరరావు ఉత్సాహంగా. అతని అంతరంగం గతం వర్తమానాల మధ్య కొట్టుమిట్టాడుతున్నది.

ఈఊరుతను విడిచిపెట్టి చాలా ఏళ్ళయ్యింది. ఆ పసితనపు జ్ఞాపకాలు మాత్రం మిగిలి పోయాయి.

"తను ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వస్తున్నట్టు?"

"ఏమండీ వీడికి చదువు వచ్చే సూచనలు కనుపించడం లేదు!" "కాన్వెంటులో కూడా నేను 'జడ్జీగారి అబ్బాయిని', అంటూ తన అధికృతని ప్రదర్శిస్తున్నాడట!" "టీచర్లు చెప్పినట్టు అసలు వినడమేలేదట!" "చదువను వ్రాయను అసలు చేయడట!" "ఇలాగైతే వీడికి చదువు ఎలా వస్తుందంటారు?" భార్య కమలిని గోలపెట్టింది.

కొన్నాళ్ళు ట్యూషన్ పెట్టి చూశాడు. ఇంటికి వచ్చిన ట్యూషన్ మాష్టర్ని ఆటపట్టించి పంప వేశాడు. జడ్జీ గారిదగ్గర ఎంత మొహమాటం వున్నా! వెంకూ దగ్గర మాత్రం అందరూ జడిసి పోతున్నారు.

తమ ఒక్కగా నొక్క బిడ్డా ఎందుకిలా తయారవుతున్నాడు. "వీడికి అసలు చదువురాదా?"

తన బిడ్డగురించి అందరూ "జడ్జీగారి అబ్బాయి!" అంటూ గర్వంగా చెప్పుకోవాలి! అనుకున్నాడు," కాని...... కాని...... లోపం ఎక్కడుంది?

"కమలినీ బాబుని నాతో ఓ చోటికి తీసుకు వెళ్తాను!" అన్నాడు నిద్ర లేస్తూనే.

కమలిని "ఎందుకు?" ఏమిటి? అని ప్రశ్నించలేదు. "వాడు బాగు పడడమే కావాలి!"

ఊరు సమీపించింది కారు.

ఈ ముప్పై ఏళ్ళలోనూ ఊర్లో పెద్ద మార్పు ఏమీకనుపించ లేదు. "కొన్ని గ్రామాలు ఇంతే కాబోలు?" అసలు అభివృద్ధినే సంతరించుకోవు.

కరంటు దీపాలు మాత్రం వచ్చినట్టున్నాయి.

కొంత వరకు తారు రోడ్డు పడింది.

ఊరి మొదట్లోనే వున్న అంకాళమ్మ గుడి కనిపించింది. అది ఇప్పుడు బాగా పాడుపడినట్టుంది. అసలు పూజలు పునస్కారాలు జరుగుతున్నట్టే లేదు.

ఇదివరలో మూడేళ్లకోసారి జాతర జరుగుతూ వుండేది. అప్పుడు ఎందరోజనం వచ్చేవారు ఈ ఊరు. రకరకాల దుకాణాలు వచ్చేవి. తాము ఎన్నో బూరలు, బుంగలు కొనుక్కునేవారు అప్పుడు. ఏదో ఆనందం, ఎంతో థ్రిల్ . "కాని..... కాని..... ఇప్పుడవన్నీ ఏవి?" బహుకార్యమగ్నత. ఎప్పుడూ బిజీ. మనిషి ప్రాణాలతో చెలగాటం!" తన వృత్తి ధర్మం అలాటిదిమరి!"

గుడిముందు ఆపాడు కారుని.

గుడిచుట్టూ చెట్లు గుబుర్లు దట్టంగా అలుముకున్నాయి.

"సున్నం వేసి ఎన్నాళ్ళయ్యిందో?" పాచిపట్టి నట్టున్నాయి గోడలు.

"దిగుబాబూ!" తను కారుదిగి డోరు తీసి పట్టుకున్నాడు చక్రధరరావు.

వెంకూ దిగాడు. వాడికిదంతా ఆశ్చర్యంగా కొత్తగా వుంది. వాడెప్పుడూ ఇలాంటి పరిసరాలు చూసలేదు. అసలు పల్లెటూర్లే చూడలేదు.

ఏదో హాయి ఆవరించింది వెంకూ మనస్సుని.

అప్పటికే చాలా మంది ఆ ఎర్రకారుని, ఆ వచ్చిన వాళ్లని చూస్తూ గుడిప్రాంతానికి వచ్చారు.

"రాబాబూ గుడిలోకి వెళ్దాం!" అంటూ గుడిలోకి నడిచాడు వెంకూతో సహా.

లోపల అంతా చీకటిగా వుంది. టార్చి లైటు వేశాడు. పలుచని వెలుగు పరుచుకుంది గుడి లోపల అంతా.

అంకాళమ్మ విగ్రహం నల్లగా వుంది. నవ్వుతున్నట్టుంది.

"ఆ దేవతలో ఏ మార్పూ లేదు".

"మరి మార్పు ఎక్కడుంది?" చక్రధరరావు కళ్ళు గుడి నలుమూలలా పరికించాయి. "ఇంతే!" తక్కున అతని చూపు ఓ చోట ఆగిపోయింది.

అంకాళమ్మ విగ్రహానికి వెనకగా మసకమసకగా ఏవో అక్షరాలు. అక్కడికి నడిచాడు జడ్జి చక్రధరరావు.

చేతిరుమాలుతో గోడ మీద బాగా తుడిచాడు. రుమాలుకి నల్లని మకిలి అంటింది. ఇప్పుడు అక్షరాలు స్పష్టతని సంతరించుకున్నాయి. వంకరటింకరగా వున్న ఆ అక్షరాల్ని ఒక్కసారి చదివాడు అతను.

అతనికన్నులలో నీరు స్పష్టాస్పష్టంగా కదిలింది. ఆ నీటి తెరలమధ్య అతని చూపులు అక్షరాల్ని స్పృశించాయి. "మాష్టారు చచ్చిపోవాలి!"

గతుక్కు మన్నాడు అతను. "తన చిన్ననాటి జ్ఞాపకం ఇలా.... ఇలా..... మిగిలి పోయిందా?"

"డాడీ!" వెంకూ పిలుపుతో వాస్తవంలోకి వచ్చాడు చక్రధరరావు.


"పదబాబూ మనం వెళ్దాం!" అంటూ కారు ఎక్కి స్టార్ట్ చేశాడు.

ఎప్పుడూ రానివ్యక్తి, అందమైన కారు ప్రజలు అపురూపంగా చూడసాగారు.

ఓ చోట కారు ఆపి, "సోమయ్య మాష్టారి ఇల్లెక్కడ బాబూ?" అంటూనే నడివయస్కుణ్ణి ప్రశ్నించాడు.

'ఆ వ్యక్తి చక్రధరరావుని నఖశిఖ పర్యంతం పరీక్షించి "బాబూ మీరెవరు?" అంటూ ప్రశ్నించాడు.

"వెంకటాచలంగారి అబ్బాయిని!"



ఆ వ్యక్తి కళ్ళు ఆనందంతో వెలిగాయి. 'అయితే..... నువ్వు .... చక్రధరానివా?"

"అవును!" అన్నాడు చక్రధరరావు.

"ఒరే చక్రీ..... చక్రీ.... " నేనురా అబద్ధాల్ని" అదే కంది అబద్ధాల్ని!" ఆనందోద్వేగంతో అన్నాడో వ్యక్తి.

చక్రధరరావు నేత్రాలలో ఏవేవో మెరుపులు మెరిసాయి. "తనూ ..... అబద్ధాలు.... అక్కిరెడ్డి.... కుండుగాడు.... మాష్టార్ని గురించి..... మరి ఊహించ లేకపోయాడు. "ఆ పసితనపు రోజులు ఎంతో మధురంగా హాయిగా వుండేవి.!"

"అబద్ధాలూ ఇప్పుడు నువ్వేం చేస్తున్నావు?" నెమ్మదిగా ప్రశ్నించాడు.

"వ్యవసాయం చేసుకుంటున్నాను!" "మాలాంటి వాళ్లం ఇంకా ఏమిటి చేయగలం?" నిరాశ ధ్వనించింది అబద్ధాలు గొంతులో.

"ఓ!" అన్నాడు చక్రధరరావు.

"చక్రీ ఈకారు నీదేనా?" అపురూపంగా కారుని స్పృశిస్తూ ప్రశ్నించాడు అబద్ధాలు.

"నాదే!" "బావుందా?" ప్రశ్నించాడు.

"చాలా బావుంది. దేనికైనా పెట్టి పుట్టాలి!". పెంపుడు తండ్రి బాగా ఆస్తి పరుడుకదా?" "ఇంతకీ నువ్వేం చేస్తున్నావు?"

"జిల్లాజడ్జీ!"

"అంతే!" ఆ వ్యక్తి వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

చిన్నగా నవ్వుకుంటూ మళ్ళీ కారు స్టార్ట్ చేశాడు చక్రధరరావు.

ఆ కారు ఓ యింటి ముందాగింది.

ఆ ఇల్లు శిధిలమై నామ మాత్రంగా మిగిలివుంది. తాటాకుల కప్పుతో తలదాచుకుంటున్నారా ఇంటివాళ్ళు.

ఆ ఇంటి మట్టిఅరుగు మీద తాటిరేకుల చాప పరుచుకుని పదిమంది పిల్లలకి చదువు చెప్తున్నాడో నడివయస్కుడు.

"సోమయ్య మాష్టారి ఇల్లిదేనాండీ?" ప్రశ్నించాడు చక్రధరరావు.

"ఆఁ ఇదే!" అని, నాన్నా నీకోసం ఎవరో వచ్చారు!" అంటూలోపలికి కేకేశాడు.

చేతికర్ర సాయంతో ఇవతలికొచ్చాడో వృద్ధుడు.

"మాష్టారూ నమస్కారం!" అన్నాడు చక్రధరరావు వినయపూర్వకంగా.

"ఎవరు బాబూ నువ్వు?" అంటూ ప్రశ్నించాడా వృద్ధుడు చక్రధరరావుని సమీపిస్తూ.

ఆయన ముఖం చూసి గతుక్కు మన్నాడు చక్రధరరావు. ఓ చెంపంతా చర్మం ఊడి వికృతంగా వుంది. కనుగుడ్డు పూర్తిగా ఊడిపోయి అక్కడో గొయ్యి మాత్రం మిగిలింది. "ఏమిటిది?" "ఎందుకిలా జరిగింది?"

"బాబూ నా ప్రశ్నకి సమాధానం చెప్పావుకాదు?"

"ఆఁ...... ఓఁ...... అంటూ క్షణకాలం తడబడి "నేను వెంకటాచలంగారి అబ్బాయిని!" అన్నాడు జీర్ణ వస్త్రధారియైన ఆయన్ని చూస్తూ.

"చక్రధరం..... అరే.... చక్రీ.... నువ్వా!" "ఎంత మారిపోయావు!" "ఇంకానీకు.... ఈ బడుగు బడిపంతులు జ్ఞాపకం వున్నాడా?" "నా మీద కోపం పోయిందా బాబూనీకు?" వాత్సల్యం తొణికిసలాడింది సోమయ్య మాష్టారి గారి గొంతులో.

"మీ సౌజన్యంతో నన్నింకా శిక్షించకండి మాష్టారూ!" "నేను చిన్నతనంలో మీపట్ల ఏదోలా ప్రవర్తించేవాణ్ణి!" జీవితం నేర్పిన పాఠం మహత్తరమైనది.

"వీడు నా బిడ్డ వెంకటేష్!" "వీడికి చదువు అబ్బలేదు!" వీడిగురించే నాకూ నా భార్యకీ బెంగ. "వీణ్ణిలాగైనా విద్యావంతుణ్ణి చెయ్యాలి మాష్టారూ!" "అభారం మీ మీద మోపుతున్నాను!" "వీడి చేత మీరు అక్షరాలు రాయించండి!"

"నేను పిల్లల్ని కొడతాను చక్రీ!" ఎటో చూస్తూ అన్నారు సోమయ్య మాష్టారు.

తుళ్ళి పడ్డాడు చక్రధరరావు. మాష్టారు గతాన్ని ఎంత చక్కగా గుర్తు చేశారు! "తనతప్పుని తనే తెలుసుకునేలా ఎలా మాట్లాడుతున్నారు?"

సిగ్గుతో అతని తల వాలిపోయింది.

"చక్రీ ఏవీ నీ చేతులు?" "అప్పుడు నేను చింతరువ్వతో ఈ అరచేతులలో కొడితే ఎర్రగా కంది పోయి బొబ్బలెక్కేవి కదూ?"

"మాష్టారూ మీరు అనాడు నన్ను అలా కొట్టబట్టే నేను ఇంతటి వాణ్ణయ్యాను!" ఓ గర్వరేఖ తళుక్కుమంది చక్రధరరావు కన్నులలో. అతని మాటలలో కృతజ్ఞత తొణికిసలాడుతోంది.

"బాబూ చక్రధరం నువ్వేం చేస్తున్నావు ఇప్పుడు?" అరుగుమీద తాటాకు చాపమీద కూచున్న అతన్ని ప్రశ్నించారు సోమయ్య మాష్టారు.

క్షణ కాలం మౌనం వహించి తరువాత అన్నాడు చక్రధరరావు: "జిల్లా జడ్జీగా నియమించ బడ్డాను!"

"బాబూ... మీరు... పొరపాటైంది...మిమ్మల్ని గురించి తెలియక ఏవేవో వాగాను!" నన్ను క్షమించండి బాబూ!" అంటూ లేచి నిలబడ్డారు సోమయ్య మాష్టారు.

గలగల నవ్వాడు చక్రధరరావు.

"నేను జిల్లా జడ్జీనైనా ఒకప్పటి మీ విద్యార్థినే మాష్టారూ!" ఎప్పుడూ విద్యార్థుల్ని చింత రువ్వతో కొడుతూవుండే మిమ్మల్ని చూస్తూవుంటే ఎంతో కసిగా వుండేది నాకు!" కాని... అనాడు మీరు నన్నలా శిక్షించబట్టే నేనింతటివాణ్ణయ్యాను మాష్టారూ!"

"బాబూ... చ...క్ర...ధ...రం...! మాష్టారి కన్నులనుండి ఆనంద బాష్పాలు జలజల రాలాయి. హృదయం ఆనంద తరంగితమయ్యింది.

"ఒసేవ్ కాముడూ ఇలారా; మన చక్రధరం వచ్చేడు!" వాడిప్పుడు వట్టి చక్రధరం కాదే!" జిల్లా జడ్జి చక్రధరరావు! ఆనందోద్వేగంతో భార్యను కేకేశారు సోమయ్య మాష్టారు.

కళ్ళజోడు చేతితో సవరించుకుంటూ వచ్చింది కామమ్మ; ఎవరూ?" అంటూ.

"మన చక్రధరం!" అదే వెంకటాచలంగారి అబ్బాయి!" పేదరికానికి పెన్నిధిలా వుందామె. రంగు వెలిసిన ముతక నేత చీర, జిడ్డు పట్టిన లావుపాటి మట్టి గాజులు, ఒకటి రెండు పళ్ళూడిపోయి, బుగ్గలు లోపలికి చొచ్చుకుపోయాయి.

ముఖంమీద మాత్రం అర్ధ రూపాయి కాసంత బొట్టు వెలిగిపోతోంది ఆమె ఐదవతనానికి చిహ్నంగా.

"ఒసేవు కావుడూ... మన చక్రధరమే!" గుర్తు పట్టలేదూ? ఉత్సాహం వెల్లి విరుస్తుండగా అన్నారు సోమయ్య మాష్టారు.

"ఆ మహానుభావుడా?" వాడినించేగా మీ కీ అవస్థ పట్టింది! తగుదునమ్మా అంటూ ఇప్పుడెందు కొచ్చినట్టు?" ఎకసక్కెంగా అంది కామమ్మగారు.

"కావుడూ చక్రి మన బిడ్డలాంటివాడు. "బిడ్డలు తప్పు చేస్తే తల్లిదండ్రులు కోపగించుకుంటారా?" అంత దూరంనించి నన్ను చూడడానికి వచ్చేడుకదే చక్రధరం!" అన్నారు సోమయ్య మాష్టారు.

ఆయన ప్రతీమాటలోనూ ఆనందం వెల్లి విరుస్తోంది.

"మాది మొదటినించీ ఒకటే పద్ధతి! నేను చెప్పిన మాట ఎప్పుడు వినిపించుకున్నారు కనక!" అంటూ లోపలికి వెళ్ళిపోయిందావిడ.

"ఈవిడ వరస ఎప్పుడూ ఇంతే చక్రధరం!" నువ్వేం బాధపడకు!" అంటూ నవ్వారు మాష్టారు.

అంతవరకూ అరుగుమీద కూచుని పిల్లలకి పాఠాలు చెప్తున్న ఆ నడి వయస్కుడు లేచి నిలబడ్డాడు వినయంగా.







తన హోదా ఉద్యోగం అతన్ని అంత నమ్రుణ్ణి చేసింది అనుకున్నాడు చక్రధరరావు. అతని పెదాలమీద చిన్న నవ్వు వెలిగింది.

"మాష్టారూ... ఇ...త...ను?" ఒక్కొక్క అక్షరాన్నే ఒత్తి పలుకుతూ ప్రశ్నించాడు చక్రధరరావు.

"నాబిడ్డ బుచ్చబ్బాయ్ బాబూ!" "నాలాగే ఉపాధ్యాయ వృత్తినే చేపట్టాడు బాబూ! కాని... కాని... ఉద్యోగం మాత్రం దొరకలేదు. పదిమంది పిల్లల్ని పోగు చేసుకుని చదువు మాత్రం చెప్తున్నాడు. "బాబూ ఇంకొక్క విషయం. విద్యార్థుల్ని కొట్టడం అనే వారసత్వాన్ని నా నుండి సంతరించుకున్నాడు బుచ్చబ్బాయ్! మాష్టారి ప్రతీ మాట వెనుక ఒకనాటి ఆయన ప్రవర్తన ధ్వనిస్తూనే వుంది. ఆ ధ్వని చక్రధరరావు హృదయాన్ని కలచి వేస్తున్నది.

మెల్లిగా అరుగు దిగాడు చక్రధరరావు. "బుచ్చబ్బాయ్ నేను గుర్తున్నానా!" "మనం చిన్నప్పుడు స్కూల్ ఎగ్గొట్టి గోళీలు ఆడుతూ వుండేవాళ్ళం!" "మాష్టారుచేత దెబ్బలు తింటూ వుండేవాళ్ళం!" "చూడు బుచ్చబ్బాయ్... మనం ఈ అరుగు చివర కూచుని ఇసుకలో అక్షరాలు దిద్దుతూ వుండేవాళ్ళం గుర్తుందా?" "వేళ్ళు ఎర్రగా వాచిపోతూ వుండెవి!" ఆ కళ్ళల్లో ఏవేవో మెరుపులు మెరుస్తున్నాయి.

"బాబుగారూ... మీరు... పెద్ద జడ్జీగారు... నసిగాడు బుచ్చబ్బాయి.


"నేను ఇప్పుడు జడ్జీనైనా ఒకనాటి నీ నేస్తాన్నే బుచ్చబ్బాయ్!" ఇప్పుడు ఇంకా... శివంగులు, ఎలుగుగొడ్లు తిరుగుతున్నాయా- బుచ్చబ్బాయ్?" ఉత్సాహంగా ప్రశ్నించాడు చక్రధరరావు.

"అటవీశాఖ ధర్మమా అని అవి ఇప్పుడు ఊర్లమీద పడడంలేదు!" అయినా అప్పుడప్పుడు వస్తున్నాయనుకో!" అంతలోనే గతుక్కుమని "అలా కూచోండి బాబూ!" అన్నాడు బుచ్చబ్బాయ్. లోపలినించి చిన్న చెక్క కుర్చీ తెచ్చివేస్తూ.

నవ్వుతూ అందులో కూచున్నాడు చక్రధరరావు. బుచ్చబ్బాయ్ భార్య స్టీలు గ్లాసుతో కాఫీ తెచ్చియిచ్చింది.

దాన్ని మింగలేక మింగాడు చక్రధరరావు.

కొంతసేపు మాష్టారితోటీ, బుచ్చబ్బాయ్‌తోటి చిన్ననాటి విషయాలు ముచ్చటించాడు. తరువాత అసలు విషయం బైట పెట్టాడు. "మాష్టారూ ఈనాబిడ్డ వెంకూని మీ దగ్గర కొంత కాలం వుంచుతాను!" వీడికి మంచి శిక్షణ నియ్యండి!" "వీడు పట్నంలో అందరిమధ్యా ఆధిక్యతని ప్రదర్శించి అసలు చదువుజోలికే పోవడంలేదు!" "వీణ్ణి మీరెలా శిక్షించినా నేను బాధపడను!" "వీడి బాగు నాకు కావాలి!" అన్నాడు చక్రధరరావు ఉద్విగ్న మనస్కుడై.




## మాష్టారు చచ్చిపోవాలి

మాష్టారి పెదాలమీద వేదాంతంతో కూడిన నవ్వువెలిగింది. "బాబూ నేను విద్యార్థుల్ని కొడతానోయ్!" ఒకనాడు నేను ఒక శ్రీమంతుల బిడ్డని కొట్టిన నేరానికే ఈ మారు మూలకి బదిలీ చెయ్యబడ్డాను! "నాటినుంచీ మరి ఇక్కడ నించి కదలలేక పోయాను!" ఇక్కడే పదవీ విరమణ చేశాను. ఆ భగవంతుడి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను!"

క్షణకాలం ఆగారు సోమయ్య మాష్టారు.

"బాబూ చక్రధరం ఈ ఉపాధ్యాయ వృత్తివుంది చూశావూ; ఆఖరి క్షణం వరకూ పిల్లలకి పాఠాలు చెప్పమంటుందోయ్; "ఇంతకీ నువ్వేమంటున్నావ్?" "మీ అబ్బాయిని, నా దగ్గరుంచుతావా?" "సంతోషం బాబూ అలాగే వుంచు" ఒసే కావుడూ ఇవాళనించి చక్రధరం బిడ్డకూడా మనతోపాటే వుంటాడే!" అన్నారు మాష్టారు ఉత్సాహంగా.

చక్రధరరావు నేత్రాలు ఆనంద బాష్పాలని వర్షించాయి.

"మాష్టారూ ఇందండి ఈ యాభైవేల రూపాయలు మీ దగ్గరుంచండి!" "ఇక్కడే స్వంతంగా ఓ బడి పెట్టుకోండి. బుచ్చబ్బాయి నిరుద్యోగం సమసిపోతుంది!" "జీవితానికో సార్థక్యం ఏర్పడుతుంది!" "అంకాళమ్మ గుడికూడా బాగు చేయించి సున్నాలు వేయించండి!" "ఈ ఏడు జాతర కూడా ఘనంగా జరిపించండి. నేను వెళ్ళివస్తాన్ను!"

"బాబూ నువ్వు నిజంగా దేముడివి!"

డబ్బు చూసేసరికి కాముడమ్మగారి కళ్ళు వెలిగాయి ఆనందోద్వేగంగా. వెంకూ ఇక్కడే వుండి చదువుకుంటాడు నువ్వెళ్ళిరాబాబూ!" అందావిడ.

"వెంకూ మాష్టారి దగ్గర వుండి జాగ్రత్తగా చదువుకో!" నేను వస్తూవుంటాను!" అంటూ కారుఎక్కి స్టార్ట్ చేశాడు జడ్జి చక్రధరరావు.

శివంగిపురం దాటి రోడ్డుమీది కొచ్చింది కారు. ఒక్కసారి వెనుదిరిగి చూశాడు. తన ముద్దుల కొడుకుని అక్కడదించి వస్తున్నాడు. "వాడు అక్కడ ఎలా వుంటాడో?"

"అసలు తనెవరు?" "మాష్టారు ఎవరు?" శివంగిపురం ఏమిటి?" అతని మనస్సు అలా గతంలోకి పరుగులు తీసింది.

★ ★ ★ ★ ★ ★ ★

ఎర్రగా కంపోయి బొబ్బలెక్కిన చేతుల వైపు చూసుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు చక్రధరం. "ఛీ ఈ మాష్టారు మంచివాడుకాదు!" అంటూ మనస్సులో నేతిట్టుకున్నాడు.

"ఒరే సెక్రీ ఈ పాటి దెబ్బలకే ఏడుత్నారేట్రా?" సూడు నా వీపు ఎట్టా సొప్పై పోనాదో!" అన్నాడు గుండుగాడు.

"నాన్నా నేను బడికెళ్ళను!" అన్నాడు చక్రధరం చొక్కాతో ముక్కు తుడుచుకుంటూ.

"బడికెళ్ళవ్?" "ఏం అంత కండకావరం?" అంటూ బరబరా లాక్కెళ్ళి సోమయ్య మాష్టారి దగ్గర దిగవిడిచారు. వెంకటాచలంగారు.


ఉక్రోషంగా చూస్తూ వుండి పోయాడు చక్రధరం. అక్కిరెడ్డి, అబద్ధాలు ఓదార్చారు.

# పావురాల పోటీలు



పావురాల పోటీలు మొదట బెల్జియమ్‌లోప్రారంభించినా తర్వాత 1820 ప్రాంతంలో వాటిని బ్రిటన్‌లో ప్రవేశపెట్టారు. అతి ఎక్కువ దూరం జరిగిన మొట్టమొదటి పోటీ 1871లో జరిగింది.

# 115అంతర్జాతీయ పోటీలు!



స్వీడన్‌కి చెందిన సాకర్ (కాలిబంతి)క్రీడాకారుడు బ్జోర్న్ నార్డ్ క్విస్ట్ 1963–79మధ్యకాలంలో 115అంతర్జాతీయ పోటీలలో పూర్తిగా ఆడాడు!

పద్ద పెద్ద మీసాలు, భయంకరమైన కంఠస్వరం, మేష్టార్ని చూస్తూ వుంటే ఏదోలా అనిపిస్తూ వుండేది చక్రధరానికి.

ఆయన చేతిలో ఎప్పుడూ చింతరువ్వ వుండేది. అక్షరాలు కుదురుగా రాయకపోతే అరుగు చివర ఇసుకపోసి దిద్దించేవారు. చిన్ని లేతవేళ్ళు అరిగిపోతూ వుండేవి. పద్యాలు పాఠాలూ ఒప్పే చెప్పకపోతే చింతరువ్వతో అరచేతుల్లో కొట్టేవారు.

"మాష్టారి పీడ వదలి పోవాలి!" అనుకునేవాడు చక్రధరం.

చక్రధరం బడికెళ్ళే దారిలోనే అంకాళమ్మ గుడివుంది. రోజూ అక్కడికి వెళ్ళి ఆ దేవతకి నమస్కరిస్తూ వుండేవాడు!" మాష్టారి పీడ వదల్చమని. మామిడి జీడి పట్టుకుని గుడి గోడలనిండా ఏవేవో రాస్తూ వుండేవాడు.

ఆ రోజు చక్రధరం స్కూల్‌కి వెళ్ళేసరికి చాలా ఆలస్యమైంది. "వెధవాయ్ ఎక్కడ చచ్చావ్?" అంటూ చింతరువ్వతో బాదారు సోమయ్య మాష్టారు.

ఏడుపు ముంచుకొచ్చింది చక్రధరానికి. ఇంటికి రివ్వున పరుగెత్తాడు "ఇంట్లో ఎవళ్ళో కొత్త వ్యక్తులు మాట్లాడుతున్నారు. "వాళ్ళు తమకి దూరపు బంధువులట!" చాలా డబ్బున్నవాళ్ళట. తనని దత్తత చేసుకుందికి వచ్చారని బామ్మ చెప్పింది. ఎగిరి గంతేశాడు చక్రధరం. ఇక మేష్టారి పీడ తనకి వుండదు.

మరునాడే దత్తత. ఎలాగైనా ఈ రాత్రికి మేష్టార్ని చంపెయ్యాలి!" పెద్దరాయి పట్టుకుని బయలుదేరాడు. మేష్టారు వీధిలో పడుకుంటారు. దీనితో ఆయన బుర్ర పగలగొట్టాలి!".

చిక్కని చీకటి. ఆ చీకట్లో నడుస్తున్నాడు చక్రధరం. ఆ ఊళ్ళో రాత్రి శివంగులు, ఎలుగుబంట్లు సంచరిస్తాయని ప్రతీతి. అయినా బయలుదేరాడు. కొంతసేపుపోతే మాష్టారు లోపలికెళ్ళిపోతారు.

మేష్టారి ఇంటిని సమీపించాడు. ఇంతలో వాడిమీద ఏదో జంతువు పడడం, వాడికి తెలివితప్పి పోవడం క్షణాలలో జరిగిపోయాయి.

మరునాడు దత్తత జరిగిపోయింది. కొత్త తండ్రితో వెళ్ళిపోతున్న తరుణంలో బామ్మ అంది "ఆ సోమయ్య మాష్టారేగాని రక్షించి వుండకపోతే రాత్రి బిడ్డ ఏమైపోయేవాడో అని. తనని మాష్టారు రక్షించారా?" కాలగర్భంలో ఏళ్ళు గడిచిపోయాయి. వర్తమానంలోకి వచ్చిపడ్డాడు. చక్రధరరావు. "తనని మాష్టారు రక్షించినట్టు తెలుసు!" కాని మాష్టారే జంతువాత పడి ఇలాగయ్యేరని తెలియదు!" అల్లరి చిల్లరగా తిరిగే కొడుకు వేళకి గుర్తొచ్చారు మాష్టారు. ఉపాధ్యాయుడి చేతిలో తగిన శిక్షణలేందీ ఏ విద్యార్థీ బాగుపడడేమో?"

కాల చక్ర సరిభ్రమణంలో రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. ఈ రెండు సంవత్సరాల్లో ఎన్నోసార్లంది కమలిని "బాబు ఎలా వున్నాడో చూసిరండీ!" అని.

"వాణ్ణి అలా ఒంటరిగా వుండనివ్వు కమలినీ; మాష్టారి అధ్యాపకత్వంలో సుశిక్షితుడై తిరిగి వస్తాడు. కష్టసుఖాలు అనేవి ఒంటికి నాటుతాయి!" అంటాడు చక్రధరం.

"అబ్బాయ్ చక్రధరం నీ బిడ్డ నా దగ్గర బాగానే చదువుకుంటున్నాడు!" అంటూ అప్పుడప్పుడూ మాష్టారు ఉత్తరాలు రాస్తూనే వున్నారు.

చక్రధరానికి వెంకూని చూడాలని బుద్ధిపుట్టింది. తన చిన్ని మారుతీకారులో బయలుదేరాడు శివంగిపురం.

ఊరి మొగికొచ్చేసరికి అంకాళమ్మ గుడి కనిపించింది. ఇప్పుడది వెల్లవేసి తెల్లగా వెలిగి పోతోంది.

అక్కడ దిగాడు చక్రధరం. మెల్లగా లోపలికి నడిచాడు. విగ్రహానికి కొంచెం వెనకగా ఎవరో కుర్రాడు నిలబడి మామిడిజీడితో ఏదో రాస్తున్నాడు.

గతుక్కుమన్నాడు చక్రధరం. "వెంకూ!" గట్టిగా కేక పెట్టాడు. వాడు గజగజ వణుకుతూ ఇటు తిరిగాడు.

"వెంకూ నీకు వారసుడు బాబూ!" వాడు కూడా రేపు నీ అంతటివాడు అవుతాడు!" సోమయ్య మాష్టారి మాటలు వినిపించి వెనుదిరిగాడు చక్రధరం

ఆయన ముఖం ప్రశాంతంగా వుంది.

"బాబూ చక్రధరం వెంకూని నీతో తీసుకువెళ్ళు!" "నీ అంతటి వాణ్ణి చెయ్యి!" "వాడు నీ అంతటి వాడయి ఇక్కడికి వచ్చినా నేను చూడడానికి నేను మాత్రం వుండను!" కాని నేను ఎక్కడ వున్నా నా ఆశీస్సులు మాత్రం మీకు అందుతూనే వుంటాయి!" నేను పైలోకం నించి మిమ్మల్ని చూస్తూ వుంటాను!"

మాష్టారు మెల్లగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

చక్రధరరావు వెంకూతో సహా నాలుగడుగులు నడిచి మళ్ళీ వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ అమ్మ వారికి కాస్త వెనుకగా ఉన్న అక్షరాలు కనిపించాయి 'మాష్టారు చచ్చిపోవాలి!" అని. □